క్లుప్తంగా

మునగపాకలో వాహన తనిఖీలు



మునగపాకలో వాహన తనిఖీలు నిర్వహిస్తున్న పోలీసులు

మునగపాక: ప్రతి వాహనదారుడు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని ఏఎస్ఐ రామకృష్ణ కోరారు. పూడిమడక రోడ్డులో మంగళవారం మునగపాక వద్ద వాహన తనిఖీలు నిర్వహించారు. ఎటువంటి రికార్డులు లేకుండా వాహనాలు నడిపే వారితో పాటు హెల్మెట్‌లు లేకుండా ప్రయాణించే ద్విచక్ర వాహనచోదకులపై కేసులు నమోదు చేశారు. ఈ సందర్భంగా రామకృష్ణ మాట్లాడుతూ వాహనాలు నడిపే వారు తప్పనిసరిగా రికార్డులు అందుబాటులో ఉంచుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా పాదాలమ్మ తల్లి పండగ



పాదాలమ్మతల్లిని దర్శించుకుంటున్న ఎమ్మెల్యే విజయకుమార్

మునగపాక: మండలంలోని చెర్లోపాలెంలో మంగళవారం పాదాలమ్మ తల్లి పండగ ఘనంగా జరిగింది. ఉదయం నుంచి అమ్మవారిని దర్శించుకునేందుకు భక్తులు తరలివచ్చారు. అమ్మవారి దర్శనానికి వచ్చే భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా నిర్వాహకులు తగు చర్యలు తీసుకున్నారు. స్థానిక ఎమ్మెల్యే సుందరపు విజయకుమార్ అమ్మవారిని దర్శించుకొని పూజలు చేశారు. పరిసర ప్రాంతాలకు చెందిన భక్తులు అమ్మవారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు.

'పది'లో శత శాతం ఉత్తీర్ణత లక్ష్యం



విద్యార్థులతో మాట్లాడుతున్న డిప్యూటీ డీఈవో అప్పారావు

ఎస్.రాయవరం: పదో తరగతి విద్యార్థులు శత శాతం ఉత్తీర్ణత సాధించే దిశగా ఉపాధ్యాయులు కృషి చేయాలని యలమంచిలి డిప్యూటీ డీఈవో పి.అప్పారావు అన్నారు. ధర్మవరం అగ్రహారం పాఠశాలను మంగళవారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. పదో తరగతి విద్యార్థులతో మాట్లాడి అభ్యసన సామర్థ్యాలను తెలుసుకున్నారు. పరీక్షలకు నెల రోజులు కూడా గడువు లేదని, నిత్యం సాధన, మెలకువలు తెలుసుకోవాలన్నారు. సమయాన్ని వృథా చేయకుండా చదువుపై దృష్టి సారించాలని ఆయన చెప్పారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రధానోపాధ్యాయుడు బి.శ్రీనివాసరావు, ఉపాధ్యాయుడు గారా ప్రకాష్‌రావు, తదితరులు పాల్గొన్నారు.

అవయవదానంతో మనిషి సజీవం

చోడవరం రూరల్: మనిషి మృతి చెందినా సజీవుడిగా ఉంచేది అవయవ దానమని ప్రిన్సిపాల్ పి.కిరణ్‌కుమార్ అన్నారు. ప్రభుత్వ డిగ్రీ కళాశాలలోని జాతీయ సేవా పథకం మూడు యూనిట్లు, సావిత్రిబాయి పూలే స్వచ్ఛంద సంస్థల ఆధ్వర్యంలో మంగళవారం అవయవ దానం పట్ల అవగాహన సదస్సు నిర్వహించారు. కార్యక్రమాన్ని ప్రిన్సిపాల్ ప్రారంభిస్తూ ప్రమాదాలు, తదితర విపత్తుల కారణంగా ప్రాణాలపైకి తెచ్చుకునే వారికి అవయవదానం ఒక్కొక్కసారి ప్రాణదానంగా నిలుస్తుందని తెలిపారు. సావిత్రిబాయి పూలే సంస్థ ప్రతినిధి బాలు మాట్లాడుతూ అవయదానం మరొకరికి ప్రాణదానం అన్న నినాదంతో ప్రతి ఒక్కరూ ముందుకు సాగాలని కోరారు. కన్యాకుమారి మాట్లాడుతూ తాను కిడ్నీ దానం చేయడానికి ముందుకు వస్తే తన కుటుంబమే వ్యతిరేకించినా తాను ధైర్యంగా ముందుకు సాగానని తెలిపారు. టైపు ఇన్‌స్టిట్యూట్ బాబ్జీ, ఉపన్యాసకులు మల్లిబాబు, ఎన్ఎస్ఎస్ పీవోలు రత్నభారతి, పిచ్చమ్మ, డి.మాల్యాద్రి పాల్గొన్నారు.

పశుగణనపై తనిఖీలు



అర్జునగిరి సచివాలయంలో రికార్డులు పరిశీలిస్తున్న ఏడీ చిట్టినాయుడు

చీడికాడ: పశుగణనపై పశు సంవర్ధక శాఖ మాడుగుల ఏరియా ఏడీ డాక్టరు చిట్టినాయుడు ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. మంగళవారం ఆయన మండలంలోని అర్జునగిరి, తురువోలు రైతు సేవా కేంద్రాల్లో పశుగణన రికార్డులను పరిశీలించారు. ఇప్పటి వరకు ఎన్ని ఇళ్లను సర్వే పూర్తి చేశారని వెటర్నరీ అసిస్టెంట్లను అడిగి తెలుసుకున్నారు. గ్రామాల్లో సర్వే చేసిన ఇళ్లను సందర్శించి నమోదు చేసిన డేటా సరిచూశారు. ఇప్పటి వరకు 50 శాతం ఆవులు, గేదెలు, 70 శాతం గొర్రెలు, మేకలు గణన పూర్తయినట్లు చెప్పారు.

జగనన్న కాలనీలపై కినుక.!

ప్రతి గ్రామంలో మరో కొత్త ఊరు..
పేదల ఆశల లోగిళ్లు..
జగనన్న కల్పించిన భరోసాతో వెలసిన కాలనీలు..
అవే జగనన్న కాలనీలు.
ఇప్పుడా ఆ కాలనీలపై కూటమి ప్రభుత్వం కినుకు వహిస్తోంది.
సౌకర్యాల కల్పనలో వెనకడుగు వేస్తోంది.
ఫలితంగా ఆయా కాలనీల్లో నివాసముంటున్న బడుగు, బలహీన వర్గాల ప్రజలు సతమతమవుతున్నారు.



- కనీస సౌకర్యాలు లేక అవస్థలు
- నేటికీ కల్పించని విద్యుత్ సదుపాయం
- కానరాని అంతర్గత రహదారులు
- తాగునీటికీ కటకట

కోటవురట్ల: గత ప్రభుత్వంలో మాజీ ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డి పేదల సొంతింటి కలను నెరవేర్చారు. సొంతిల్లు లేని కుటుంబం ఉండకూడదనే దృఢ సంకల్పంతో ప్రతి ఒక్కరికీ స్థలం ఇచ్చి ఇల్లు నిర్మించుకునేందుకు ఆర్థిక సాయం అందించారు. జగనన్న కల్పించిన భరోసాతో ఎన్నో ఆశలతో ఇళ్లు నిర్మించుకున్నారు. ఫలితంగా ఊళ్లకు ఊళ్లు వెలిశాయి. అంతా బాగానే ఉందనుకున్న తరుణంలో ప్రభుత్వం మారింది. జగనన్న కాలనీల తలరాత మారింది. కొత్త ప్రభుత్వం వచ్చి దాదాపు పది నెలలు కావస్తున్నా జగనన్న కాలనీలలో సమస్యలు పరిష్కారానికి నోచుకోలేదు. పైగా ఈ కాలనీల అభివృద్ధిపై కూటమి సర్కారు నిరాశక్తంగా ఉండడంతో అధికారులు కూడా కినుక వహిస్తున్నారు. పైగా ఇప్పటికే ఇంటి స్థలం పట్టా పొంది పేదరికం కారణంగా ఇళ్లు నిర్మించుకోలేకపోయిన వారి డేటా సేకరించి ఇవ్వాలని ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. అటువంటి వారి స్థలాలను వెనక్కి తీసుకునే యోచనలో ప్రభుత్వం ఉన్నట్టు తెలుస్తోంది. దాంతో ఇప్పటికే ఇల్లు కట్టని వారి సమాచారాన్ని ప్రభుత్వానికి నివేదిక ఇచ్చారు. మరోవైపు ఇప్పటికే ఇళ్ల నిర్మించుకున్న వారి పరిస్థితి త్రిశంకు స్వర్గంలా మారింది. ఎన్నో సమస్యలతో సతమతమవుతున్నా అధికారులు పట్టించుకోలేదన్న ఆవేదన వ్యక్తమవుతోంది. పైగా గొంతు వినిపిస్తే అణచివేసే ధోరణిలో ఉండడంతో సమస్యలతోనే సావాసం చేస్తున్నారు. ఎన్ని సమస్యలున్నా నోరుమెదపలేక కాలం వెళ్లదీస్తున్నారు. అధికారుల చుట్టూ ప్రదక్షిణ చేసి బతిమాలుకున్నా కరుణించడంలేదు. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో మండలంలోని 25 పంచాయతీలలో 32 లేఅవుట్లు ఏర్పాటు చేశారు. ఇందులో 1740 మంది లబ్ధిదారులకు ఇంటి స్థలాన్ని ఉచితంగా ఇచ్చి ఇళ్లు నిర్మించుకునేందుకు ఆర్థిక సాయం అందించారు. ప్రస్తుతం 801 మంది ఇంటి నిర్మాణాలను పూర్తిచేయగా.. చాలా మంది గృహ ప్రవేశాలు చేశారు. 192 పునాదుల స్థాయిలోను, 27 సన్‌సైడ్ దశలోను, 64 శ్లాబ్ వరకు, 38 శ్లాబ్ పూర్తయిన దశలో ఉన్నాయి.



అంతర్గత రోడ్డు దుస్థితి



కనెక్షన్లు లేని విద్యుత్ స్తంభాలు

అన్నీ సమస్యలే..

జగనన్న కాలనీలలో అనేక సమస్యలున్నాయి. ఇళ్లు నిర్మించుకుని గృహ ప్రవేశాలు చేసినా ఉండేందుకు సదుపాయాలు లేక ఇబ్బంది పడుతున్నారు. 32 లే అవుట్లలో అంతర్గత రోడ్లు అభివృద్ధి చేయలేదు. పూర్తి స్థాయిలో విద్యుత్ సరఫరా ఇవ్వలేదు. తాగునీరు అందడం లేదు. మండల కేంద్రంలోని పెట్రోలు బంకు వెనుక ఉన్న పెద్ద లే అవుట్‌లో 167 మంది లబ్ధిదారులు ఉన్నారు. ఇంత పెద్ద లేఅవుట్‌కు అప్రోచ్ రోడ్డు లేకపోవడంతో తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. విద్యుత్ స్తంభాలు, విద్యుత్ లైన్లు ఉన్నప్పటికీ ఇళ్లకు విద్యుత్ సరఫరా ఇవ్వలేదు. తాగునీటి సరఫరా లేదు. లే అవుట్‌లోకి వెళ్లాలంటే నానా అవస్థలు పడుతున్నారు. ఇదే పరిస్థితి ప్రతి గ్రామంలో ఉందని పలువురు ఆరోపిస్తున్నారు. ప్రభుత్వం మారాక పూర్తిగా పట్టించుకోవడం మానేశారన్న విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

అప్రోచ్ రోడ్డుకు ప్రతిపాదన చేశాం..



కోటవురట్లలోని పెట్రోలు బంక్ వెనుక ఉన్న ప్రధాన లే అవుట్‌కు అప్రోచ్ రోడ్డు లేకపోవడం వాస్తవమే. రోడ్డు కోసం ఓ వ్యక్తి నుంచి స్థలం సేకరించి ఉన్నతాధికారులకు నివేదిక ఇచ్చాం. అనుమతి రాగానే రోడ్డు నిర్మిస్తాం. అప్రోచ్ రోడ్డు అయితే కాని విద్యుత్ సరఫరా ఇవ్వడానికి అవకాశం లేదు. మంచినీటి ట్యాంకు నిర్మించాం. త్వరలో అప్రోచ్ రోడ్డు నిర్మించి విద్యుత్ సరఫరా అందిస్తాం.

– బి.వరప్రసాద్, ఏఈ, గృహ నిర్మాణ శాఖ, కోటవురట్ల

అంగన్‌వాడీ టీచర్లకు శిక్షణ



మాట్లాడుతున్న ఎంఈవో వేణుగోపాలరావు

మునగపాక: మునగపాక జిల్లా పరిషత్ హైస్కూల్‌లో మంగళవారం మండల స్థాయి అంగన్‌వాడీ టీచర్ల శిక్షణ తరగతులు ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా ఎంఈవోలు వేణుగోపాలరావు, శివనాయుడు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం కొత్తగా అమలు చేస్తున్న జ్ఞానజ్యోతి కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. అంగన్‌వాడీ కేంద్రాలకు వచ్చే పిల్లలు, బాలింతలు, గర్భిణులకు పోషక విలువలతో కూడిన ఆహారాన్ని అందించాలన్నారు. కేంద్రాల నిర్వహణ పట్ల బాధ్యతగా ఉండాలన్నారు. హైస్కూల్ హెచ్ఎం శ్రీనివాసరావు, ఐసీడీఎస్ అధికారులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

ప్రారంభోత్సవానికి సిద్ధంగా మంచినీటి పథకం



గంగాదేవిపేటలో రక్షిత మంచినీటి పథకం

మునగపాక: మండలంలోని గంగాదేవిపేటలో రక్షిత మంచినీటి పథకం ప్రారంభోత్సవానికి సిద్ధంగా ఉంది. జల జీవన్ మిషన్ పథకం ద్వారా రూ.43 లక్షల వ్యయంతో గంగాదేవిపేట ప్రజలకు తాగునీటిని అందించేందుకు ట్యాంక్‌ను నిర్మించారు. ఇప్పటికే గ్రామంలో వీధి కుళాయిలను ఏర్పాటు చేశారు. పథకం ప్రారంభించేందుకు అవసరమైన చర్యలను అధికారులు తీసుకుంటున్నారు. ఈ పథకం ప్రారంభమైతే తాగునీటి సమస్య ఉండదని ప్రజలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

హెల్మెట్ ధారణతో ప్రాణాలకు భద్రం



నక్కపల్లి నుంచి హెల్మెట్‌లు ధరించి ర్యాలీ నిర్వహిస్తున్న పోలీసు సిబ్బంది, వాహనచోదకులు

- నర్సీపట్నం డీఎస్పీ శ్రీనివాసరావు
- నక్కపల్లిలో ఉత్సాహంగా పోలీసుల ర్యాలీ



ర్యాలీ ప్రారంభిస్తున్న డీఎస్పీ శ్రీనివాసరావు

నక్కపల్లి: ద్విచక్ర వాహనాలు వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించి ప్రాణాలు కాపాడుకోవాలని నర్సీపట్నం డీఎస్పీ శ్రీనివాసరావు అన్నారు. మంగళవారం నక్కపల్లి సర్కిల్ ఇన్‌స్పెక్టర్ కుమారస్వామి ఆధ్వర్యంలో రోడ్డు ప్రమాదాల నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. సుమారు 100 మోటారు సైకిళ్లపై హెల్మెట్ ధరించి నక్కపల్లి నుంచి అడ్డురోడ్డు, అక్కడి నుంచి వెదుళ్లపాలెం వరకు ఈ ర్యాలీ సాగింది. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ రోడ్డు ప్రమాదాల పట్ల ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలన్నారు. ట్రాఫిక్ రూల్స్ పాటించకపోవడం వల్లే ఎక్కువగా ప్రమాదాలు సంభవిస్తున్నాయన్నారు. ప్రమాద సమయంలో తలకు బలమైన గాయం తగలకుండా హెల్మెట్ రక్షణ కల్పిస్తుందన్నారు. రోడ్లపై జరిగే ద్విచక్ర వాహన ప్రమాదాల్లో హెల్మెట్ లేకపోవడం వల్ల తలకు గాయాలై ప్రాణాలు కోల్పోవడం వంటి ఘటనలు జరుగుతున్నాయన్నారు. మితిమీరిన వేగంతో బైక్‌లు నడపడం కూడా ప్రమాదాలకు కారణమని డీఎస్పీ చెప్పారు. రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రభుత్వం, పోలీసు, రవాణా శాఖ ఎన్ని కార్యక్రమాలు చేపట్టినప్పటికీ ప్రజల నుంచి సహకారం, బాధ్యత లేకపోతే ప్రమాదాల నివారణ సాధ్యం కాదన్నారు. మద్యం సేవించి వాహనాలు నడపడం చట్టరీత్యా నేరమన్నారు. ఆటోవాలాలు పరిమితికి మించి ప్రయాణికులను ఎక్కించుకోవద్దన్నారు. సెల్‌ఫోన్‌లో మాట్లాడుతూ ఆటోలు, మోటారు సైకిళ్లు నడిపితే కేసులు నమోదు చేస్తామన్నారు. ఆటో డ్రైవర్ల ఉపాధి దెబ్బతీయకూడదన్న ఉద్దేశంతో నామమాత్రపు జరిమానా విధించి విడిచిపెడుతున్నామని, కఠినంగా ఉంటే ఆటోలు నడిపే అవకాశం ఉండదని హెచ్చరించారు. ఈ విషయాన్ని ప్రతి ఒక్కరూ గమనించాలన్నారు. వరుసగా ప్రమాదాలకు కారణమవుతున్న వాహనచోదకులు, ఆటో డ్రైవర్లపై ప్రత్యేక దృష్టి పెట్టాలని సిబ్బందికి సూచించారు. ఈ ర్యాలీలో సీఐ కుమారస్వామి, ఎస్ఐ సన్నిబాబు, పలువురు ద్విచక్ర వాహన చోదకులు పాల్గొన్నారు.

బస్సు సర్వీసు పునరుద్ధరణకు వినతి



జిల్లా ప్రజా రవాణాధికారి అప్పలనాయుడుకు వినతిపత్రం అందిస్తున్న భోగేశ్వరరావు

మునగపాక: విశాఖ కలెక్టరేట్ నుంచి అచ్యుతాపురం వరకు బస్సు సదుపాయం కల్పించాలని కోరుతూ మునగపాక మండలం పాటిపల్లికి చెందిన బాపూజీ యువజన సంక్షేమ సంఘం అధ్యక్షుడు మొల్లేటి భోగేశ్వరరావు మంగళవారం జిల్లా ప్రజా రవాణాధికారి అప్పలనాయుడుకు వినతిపత్రం అందజేశారు. గత 15 సంవత్సరాల క్రితం 77బీ బస్సు మునగపాక మండలంలో పలు గ్రామాల మీదుగా రాకపోకలు సాగించేదని, దీంతో వ్యాపారులు, ఉద్యోగులు, విద్యార్థులకు అనువుగా ఉండేదన్నారు. కొన్నేళ్లుగా బస్సు సర్వీసును నిలిపివేయడంతో అన్ని వర్గాల ప్రజలు ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఈ నేపథ్యంలో విశాఖ కలెక్టరేట్ నుంచి కేజీహెచ్ మీదుగా గాజువాక, తానాం, వెంకటాపురం, సిరసపల్లి, తోటాడ, పాటిపల్లి, మునగపాక మీదుగా అచ్యుతాపురం వరకు బస్సు సదుపాయం కల్పించాలని కోరారు.

లలితా ఫెర్రో పరిశ్రమను యథావిధిగా నడపాలి



కార్మికులతో మాట్లాడుతున్న సీఐటీయూ నాయకుడు రాము

అచ్యుతాపురం రూరల్: రాజరాజేశ్వరి లలిత త్రిపుర సుందరి పరిశ్రమ యాజమాన్యం కార్మికులకు రెండు నెలల బకాయిలు వెంటనే చెల్లించి, యథావిధిగా పరిశ్రమను నడపాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు రొంగలి రాము డిమాండ్ చేశారు. మంగళవారం పరిశ్రమ కార్మికులతో మాట్లాడి విషయం తెలుసుకుని అండగా ఉంటామని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యుత్ బిల్లుల బకాయిలు ఉన్నాయని సరఫరా నిలిపివేయడంతో ఉత్పత్తి ఆగిపోయిందన్నారు. అప్పటి నుంచి ప్రతి రోజూ కంపెనీని ఎప్పుడు తెరుస్తారా? తమకు జీతాలు ఇస్తారా? కార్మికులు ఆశతో ఎదురుచూస్తున్నారన్నారు. సోమవారం కార్మికులను కంపెనీకి రావద్దని చెప్పడంతో అంతా ఆందోళనలకు గురయ్యారని చెప్పారు. ఎటువంటి ముందస్తు నోటీసులు ఇవ్వకుండా ఇలా నిర్ణయం తీసుకోవడం దారుణమన్నారు. వెంటనే ప్రభుత్వం, కార్మిక శాఖాధికారులు స్పందించి పరిశ్రమ నడిచేలా చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు.

కనుల పండువగా విగ్రహాల ఊరేగింపు



పట్టణంలో శివపార్వతుల విగ్రహాల ఊరేగింపు చేపడుతున్న నిర్వాహకులు



ఊరేగింపులో కోలాట ప్రదర్శన

యలమంచిలి రూరల్: పట్టణంలోని కొత్తపేట పురాతన శివాలయంలో విగ్రహ పునః ప్రతిష్ఠ క్రతువులో రెండో రోజు విగ్రహాల ఊరేగింపు కనుల పండువగా సాగింది. మంగళవారం సాయంత్రం 5 నుంచి రాత్రి 8 గంటల వరకు ప్రాణ ప్రతిష్ఠ చేయనున్న శివపార్వతుల విగ్రహాలను పట్టణంలోని ప్రధాన వీధుల మీదుగా ఊరేగింపుగా తీసుకొచ్చారు. కోలాట ప్రదర్శనలు, సన్నాయి, మేళ తాళాలతో ఊరేగింపు ఆద్యంతం శోభాయమానంగా కొనసాగింది. శివ నామ స్మరణతో పట్టణం మార్మోగిపోయింది. అంతకు ముందు పునర్నిర్మించిన ఆలయం వద్ద రెండో రోజు గణపతి పూజ, పుణ్యాహవచనం, ప్రాతరౌపాసన, నిత్యపూజ, వేదపారాయణ, మండలారాధన, రుద్ర హోమాలు, జీర్ణమూర్తి కళాపకర్షణ, ప్రధాన కలశస్థాపన నిర్వహించారు. పునర్నిర్మాణ కమిటీ సభ్యులు పెద్దింటి సూర్యనారాయణమూర్తి, బండారు సత్య బంగారుశెట్టి, సుందరపు బాబ్జీ, దాట్ల సుబ్బరాజు, చందక అప్పారావు, సీతాజీ, లంకరాజు, పిల్లా త్రినాథరావు, తదితరులు పాల్గొన్నారు.

బాల్య వివాహాలతో అనర్థాలు



అవగాహన కల్పిస్తున్న బాలల హక్కుల పరిరక్షణ కమిటీ సభ్యుడు లోవరాజు

యలమంచిలి రూరల్: బాల్య వివాహాల వల్ల ఎన్నో అనర్థాలు ఎదురవుతాయని, చట్ట ప్రకారం అమ్మాయిలకు 18 ఏళ్లు, అబ్బాయిలకు 21 ఏళ్ల వయసు వచ్చిన తర్వాతే వివాహం చేసుకోవాలని బాలల హక్కుల పరిరక్షణ జిల్లా కమిటీ సభ్యుడు డి.లోవరాజు అన్నారు. మంగళవారం పట్టణంలోని తులసీనగర్ జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాలలో బాల్య వివాహాలపై జరిగిన అవగాహన సమావేశంలో ఆయన మాట్లాడారు. సామాజికంగా, ఆరోగ్యపరంగా బాల్య వివాహాలు ఎంత మాత్రం ఆమోదయోగ్యం కాదన్నారు. బాల్య వివాహాల నిరోధక చట్టం, మైనర్లపై లైంగిక వేధింపులు, లైంగిక దాడులకు సంబంధించి రక్షణకు అమలులో ఉన్న పోక్సో చట్టంపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయురాలు వీవీ హిమబిందు, ఏఎన్ఎం మోహిని, ఉపాధ్యాయురాలు రజని, తదితరులు పాల్గొన్నారు.

ప్రశాంత వాతావరణంలో ఎమ్మెల్సీ ఎన్నికలు



కోటవురట్లలో పోలింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న తహసీల్దారు తిరుమలబాబు

కోటవురట్ల: ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలు ప్రశాంతంగా జరిగేలా చర్యలు తీసుకుంటున్నట్టు తహసీల్దారు తిరుమలబాబు తెలిపారు. స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రాన్ని ఆయన మంగళవారం పరిశీలించారు. ఏర్పాట్లపై హెచ్ఎం ఎం.లక్ష్మికి సూచనలు చేశారు. ఎటువంటి అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా ఎన్నికలు పూర్తయ్యేందుకు అంతా సహకరించాలన్నారు. ఈ కార్యక్రమంలో రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

ప్రాథమిక స్థాయిలోనే పునాది వేయాలి



పాయకరావుపేటలో అంగన్‌వాడీ టీచర్లకు శిక్షణ ఇస్తున్న డీఆర్‌పీలు



కోటవురట్లలో జ్ఞానజ్యోతి కార్యక్రమంలో సూచనలు ఇస్తున్న ఏఎంవో పట్నాయక్

కోటవురట్ల: చిన్నారులకు ప్రాథమిక స్థాయిలోనే విద్యపై ఆసక్తిని పెంచేలా అంగన్‌వాడీ కార్యకర్తలు కృషి చేయాలని అసిస్టెంట్ మోనిటరింగ్ ఆఫీసర్ పట్నాయక్ కోరారు. స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో జ్ఞానజ్యోతి కార్యక్రమాన్ని మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అంగన్‌వాడీ కార్యకర్తలకు నైపుణ్యం పెంపొందేలా శిక్షణా ఇస్తున్నారని తెలిపారు. అనంతరం మధ్యాహ్న భోజన పథకాన్ని పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఎంఈవోలు రామారావు, శ్రీజోష్, హెచ్ఎం ఎం.లక్ష్మి, ఉపాధ్యాయుడు నారాయణరెడ్డి, రీసోర్స్ పర్సన్స్ పాల్గొన్నారు.

ప్రశాంత వాతావరణంలో విద్యాభ్యాసం

పాయకరావుపేట: అంగన్‌వాడీ కేంద్రాల్లో పిల్లలకు ప్రశాంత వాతావరణంలో విద్యాభ్యాసం చేయాలని డిస్ట్రిక్ రీసోర్స్ పర్సన్(డీఆర్‌పీ)లు హరికృష్ణ, శ్రీను, సతీష్ అన్నారు. నేషనల్ ఎడ్యుకేషన్ పాలసీలో భాగంగా అంగన్‌వాడీ కేంద్రాల్లో పిల్లలకు విద్యాభ్యాసంపై అంగన్‌వాడీ టీచర్లకు జ్ఞానజ్యోతి కార్యక్రమం నిర్వహించారు. పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన ఈ శిక్షణ కార్యక్రమంలో డీఆర్‌పీలు బాల్య సంరక్షణ, బాల్యంలో విద్యను అందించడంపై అవగాహన కల్పించారు. ఈ నెల 24వ తేదీ వరకు ఈ శిక్షణ కొనసాగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో మండల విద్యాశాఖాధికారులు కె.ఎన్.గాంధీ, కె.రమేష్‌బాబు, ఐసీడీఎస్ సూపర్‌వైజర్‌లు జి.సౌజన్య, మహమ్మద్ నిషా, ఆయా గ్రామాల అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.

ఎస్.రాయవరం: అంగన్‌వాడీ కేంద్రాల్లో మూడు సంవత్సరాల చిన్నారులకు మెరుగైన బోధన చేయాలని ఎంఈవోలు అప్పారావు, స్వప్నప్రియా రెడ్డి అన్నారు. అంగన్‌వాడీలకు శిక్షణ కార్యక్రమం మంగళవారం ధర్మవరం అగ్రహారం పాఠశాలలో ప్రారంభించారు. పిల్లలను పాఠశాల విద్యకు అంగన్‌వాడీ కేంద్రాల్లో సంసిద్ధం చేసి, అభ్యసనను మెరుగుపరచాలన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు బి.శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.


పశుబీమా పథకంతో మేలు

కె.కోటపాడు: ఆవులు, గేదెలకు పశు బీమా పథకం అమలు చేస్తున్నట్లు స్థానిక పశుసంవర్ధక శాఖ ఇన్‌చార్జ్ అసిస్టెంట్ డైరెక్టర్ సిహెచ్.వై.నాయుడు తెలిపారు. దీని కోసం పాడి రైతులు రైతు సేవా కేంద్రాల్లో పశువైద్య సహాయకులను సంప్రదించాలన్నారు. ఈ బీమా ఎస్సీ, ఎస్టీ, బీసీ రైతులకు వర్తించనున్నట్లు తెలిపారు. ఈ బీమా కలిగి ఉన్న పశువులు మూడేళ్ల లోపు మరణిస్తే నగదు అందించనున్నట్లు తెలిపారు. పశువు ఖరీదును బట్టి రూ.15 వేల నుంచి రూ.50 వేల వరకూ బీమా చేయించనున్నట్లు తెలిపారు. బీమా రాయితీ పోను రైతుల వాటాను చెల్లిస్తే పథకం వర్తిస్తుందన్నారు. కె.కోటపాడు, దేవరాపల్లి మండలాల్లో పాడి రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

ఎస్.రాయవరం: కొరుప్రోలు విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో ఎస్.రాయవరం ఫీడర్‌లో ఉన్న లైన్‌లో చెట్ల కొమ్మలు, తీగలు తొలగించనున్న దృష్ట్యా బుధవారం విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్టు అనకాపల్లి ఈఈ రాజశేఖర్ తెలిపారు. ఈ మేరకు ఎస్.రాయవరం, వాకపాడు, వెంకటాపురం, సర్వసిద్ధి, సైతారుపేట తదితర గ్రామాలకు, ఆక్వా పరిశ్రమలకు ఉదయం 9 నుంచి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్టు పేర్కొన్నారు. వినియోగదారులు సహకరించాలని ఆయన కోరారు.

ఆంగ్లంతో ఉన్నత స్థానం



విద్యార్థులకు ఆంగ్ల భాష ప్రాధాన్యత వివరిస్తున్న ప్రధానోపాధ్యాయుడు శాస్త్రి

యలమంచిలి రూరల్: విద్యార్థి దశలోనే ఆంగ్లంపై పట్టు సాధిస్తే మంచి ఉద్యోగ, వ్యాపార అవకాశాలు దక్కే అవకాశం ఉందని జంపపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఏవీహెచ్ శాస్త్రి అభిప్రాయపడ్డారు. మంగళవారం పాఠశాలలో నిర్వహించిన ఆంగ్ల భాషా దినోత్సవం సందర్భంగా ఆయన విద్యార్థులకు ఆంగ్ల భాష అవసరం, అంతర్జాతీయంగా ఆంగ్లం ప్రాముఖ్యత వివరించారు. అంతకు ముందు విద్యార్థులకు చిత్ర లేఖనం, ఆంగ్లం రీడింగ్‌పై పోటీలు నిర్వహించారు. పోటీల్లో ప్రతిభ చూపిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు కృష్ణారావు, సుబ్బారావు, బొడ్డేడ సత్యనారాయణ, రామ అప్పలనాయుడు, నాగరాజు, సుధాకర్, షబ్బీర్, శివ, చిట్టిరాజు పాల్గొన్నారు.